## సాగర్ టు శ్రీశైలం లాంచీ ప్రారంభం



నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి లాంచీ ప్రయాణం ఈ సీజన్‌లో ప్రారంభమైంది. నదీ మార్గంలో లాంచీ ప్రయాణానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో శనివారం నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమలకొండ అన్నపూర్ణ, టూరిజం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నర్సింహ, మేనేజర్ హరిబాబు కలిసి లాంచీకి పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. – నందికొండ

## • సోమశిల టు శ్రీశైలం..



తెలంగాణ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో శనివారం సోమశిల నుంచి శ్రీశైలానికి లాంచీని ప్రారంభించారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతోపాటు క్రూయిజ్ సీటింగ్ కెపాసిటీకి సరిపడా పర్యాటకులు రావడంతో సోమశిల నుంచి లాంచీ బయలుదేరింది. – కొల్లాపూర్/శ్రీశైలం

# దుద్దెడ-సిరిసిల్ల అలైన్‌మెంట్ మార్చండి

- ఆ రహదారిని కోరుట్ల వరకు పొడిగించాలి
- కేంద్ర మంత్రి బండికి మాజీ ఎంపీ వినోద్ సూచన



సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : దుద్దెడ–సిరిసిల్ల జాతీయ రహదారిని కోరుట్ల వరకు పొడిగించేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కేంద్ర మంత్రి బండి సంజయకుమార్‌కు సూచించారు. తిట్ల వర్షం, తిట్ల పురాణం, రాజకీయాలను పక్కన పెట్టి జిల్లా అభివృద్ధి కోసం పాటుపడాలని హితవుపలికారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సూర్యాపేట– సిద్దిపేట– సిరిసిల్ల, వరంగల్– కరీంనగర్– సిరిసిల్ల – కామారెడ్డి – పిట్లం వరకు రెండు జాతీయ రహదారుల కోసం కేసీఆర్ హయాంలో ప్రతిపాదనలు చేశారని, అప్పట్లో అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించిన విషయాన్ని గుర్తుచేశారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు అనేక జాతీయ రహదారులకు ప్రతిపాదనలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం జనగామ–సిద్దిపేట రహదారి పనులు తుదిదశకు వచ్చినట్టు తెలిపారు. సిద్దిపేట జిల్లా దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు చేపడుతున్న 365బీ జాతీయ రహదారిని వేములవాడ, చందుర్తి, కథలాపూర్ మీదుగా కోరుట్ల వరకు పొడిగించాలని, అందుకు కేంద్రానికి ప్రతిపాదనలు చేయాలని కోరారు. జాతీయ రహదారి సిరిసిల్ల పట్టణంలోకి ప్రవేశించకుండా బయటి నుంచి నిర్మించాలని కోరారు. తంగళ్లపల్లి ఊరు బయటి నుంచి వెళ్తున్న రైల్వే ట్రాక్ పక్కనుంచే జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని, సిరిసిల్ల మానేరు నదిపై రోడ్–కం– రైల్వే బ్రిడ్జి నిర్మించాలని సూచించారు. సమావేశంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులను అడ్డుకున్న భూనిర్వాసిత రైతులు

## ఎకరాకు 20 లక్షలు ఇవ్వాల్సిందే

- సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసిత రైతుల హెచ్చరిక
- జూలూరుపాడు మండలంలో లింక్ కెనాల్ పనుల అడ్డగింత

జూలూరుపాడు, నవంబర్ 2 : సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు ఎకరానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాల్సిందేనని, లేకుంటే కాలువ పనులను జరగనివ్వబోమని భూనిర్వాసిత రైతులు హెచ్చరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని వినోభానగర్ గ్రామ సమీపం నుంచి సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వకు అనుసంధానంగా నిర్మిస్తున్న లింక్ కెనాల్ కాల్వ పనులను శనివారం అడ్డుకున్నారు. కాలువ పనులు జరుగుతున్న ప్రదేశంలోని జేసీబీలు, యంత్రాలను పక్కన పెట్టించి డ్రైవర్లను ఇంటికి పంపారు. తమకు తెలియకుండా పనులు చేపడితే రైతు సంఘాలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ మేరకు ఎకరానికి రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వకపోతే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు.

## ఏపీ ప్రతిపాదనలు అసమంజసం

- గోదావరి ట్రిబ్యునల్ అవసరం లేదు
- కేంద్ర జల్ శక్తి శాఖకు తెలంగాణ సర్కారు లేఖ

హైదరాబాద్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): గోదావరి జలాల వాటాలు, నీటి లభ్యతపై ఏపీ ప్రభుత్వం లేవనెత్తుతున్న అంశాలన్నీ అసమంజసమని తెలంగాణ సర్కారు కొట్టిపారేసింది. గోదావరి జలాల పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవద్దని తేల్చిచెప్పింది. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తి శాఖకు తెలంగాణ రాష్ట్ర సాగు నీటిపారుదల శాఖ సెక్రటరీ ఇటీవల లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం గోదావరిపై చేపట్టిన ప్రాజెక్టులతో పోలవరం, ఇతర ప్రాజెక్టుల నీటి లభ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ఈ నేపథ్యంలో గోదావరి నీటి లభ్యతపై కచ్చితమైన లెక్కలు, పునఃపంపిణీ చేయాలని గతంలోనే కేంద్ర జల్‌శక్తి శాఖకు ఏపీ సర్కారు విజ్ఞప్తి చేసింది. ఏపీ చేసిన ప్రతిపాదలను తాజాగా తెలంగాణ సర్కారు ఆక్షేపించింది.



ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం మోటమర్రిలో సీపీఎం మండల మహాసభలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

## రుణమాఫీ చేయకపోతే రోడ్డెక్కుతాం

**ముగ్గురు మంత్రులున్నా లాభం లేదు**
**సీపీఎం నేత పోతినేని సుదర్శన్‌రావు**

బోనకల్లు, నవంబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి రోడ్డెక్కి ఆందోళనలు చేపడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు హెచ్చరించారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం మోటమర్రి గ్రామంలో శనివారం నిర్వహించిన 9వ సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ముగ్గురు మంత్రులున్నా పూర్తి చేయకపోవడం బాధాకరమని అన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చే సమయంలో రేషన్‌కార్డు ఆధారంగా ఇచ్చారా? మాఫీకి, దీనికి లింకు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ సర్కార్ ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఖజాన ఖాళీ అనే విషయం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులకు తెలియదా? కౌలు రైతులకు ఇచ్చిన హామీ ఏమైంది? రైతు భరోసా, రైతుబంధుపై ఎన్నిసార్లు మాట తప్పుతారని మండిపడ్డారు.

## ఏసీబీకి చిక్కిన తహసీల్దార్

**ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి కూడా..**



ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, ఇన్‌చార్జి కార్యదర్శి

జైనూర్, నవంబర్ 2 : సీసీ రోడ్ల బిల్లుల మంజూరు కోసం ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.12 వేలు లంచం తీసుకుంటూ తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పోచంలొద్దిలో సీసీ రోడ్లు వేసిన కాంట్రాక్టర్ సుబోధ్ కాంత్‌కు రూ.9.10 లక్షల బిల్లుల రావాల్సి ఉన్నది. ఇందుకోసం 15 రోజుల క్రితం తహసీల్దార్ తిరుపతిని కలిశాడు. ఇందుకు ఆయన రూ.12 వేల లంచం డిమాండ్ చేశాడు. కాంట్రాక్టర్ సుబోధ్ కాంత్ శనివారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో పోచంలొద్ది ఇన్‌చార్జి కార్యదర్శి శేఖర్ ద్వారా తహసీల్దార్‌కు డబ్బులు ఇస్తుండగా, కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ కృష్ణకుమార్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్ దూశెట్టి తిరుపతి, పోచంలొద్ది ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శేఖర్‌పై కేసు నమోదు చేసినట్టు వారు పేర్కొన్నారు.

## ఎస్‌సీఆర్ ఆధ్వర్యంలో 'నిఘా' వారోత్సవాలు

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో నిఘా అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం నెక్లెస్‌రోడ్ రైల్వే స్టేషన్‌లో ఇంటిగ్రిటీ హాకథాన్ నిర్వహించారు. ఎస్‌సీఆర్ జీఎం అరుణ్‌కుమార్ జైన్, అడిషనల్ జీఎం నీరజ్ అగర్వాల్, సీనియర్ డిప్యూటీ జీఎం వినయన్‌తోపాటు రైల్వేలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. రైల్వే జీఎం నిఘా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడానికి సంబంధించిన ర్యాలీని ప్రారంభించారు. అవినీతి నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జీఎం వెల్లడించారు.

## • 'అంబుజా'కు వ్యతిరేకంగా రిలే దీక్ష



అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు వ్యతిరేకంగా యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో శనివారం అఖిలపక్ష నాయకులు రిలే నిరహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రజలకు నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. – రామన్నపేట

# రాష్ట్ర ఓటర్లు 3.34 కోట్లు

**పురుషులు 1.66 కోట్లు, మహిళలు 1.68 కోట్లు**

- ఈసారి కొత్తగా 8,02,805 ఓటర్లు నమోదు
- 9, 10 తేదీల్లో ఓటరు జాబితా వెరిఫికేషన్ క్యాంపెయిన్
- అభ్యంతరాలకు ఈ నెల 28 వరకు గడువు
- వచ్చే ఏడాది జనవరి 6న ఓటర్ల తుది జాబితా
- కొత్త ఓటర్ జాబితా విడుదల చేసిన సీఈవో





హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రస్తుత ఓటర్ల సంఖ్య 3,34,26,323 ఉన్నట్టు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సీఈవో కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కొత్త ఓటర్ జాబితా విడుదల చేశారు. రివైజ్డ్ ఓటర్ జాబితాలను అక్టోబర్ 29న విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి అక్టోబర్ 20 వరకు ఓటరు నమోదు నిర్వహించినట్టు తెలిపారు. మొత్తం ఓటర్లలో 1,66,16,446 మంది పురుషులు, 1,68,07,100 మంది మహిళా ఓటర్లు ఉన్నట్టు వెల్లడించారు. అయితే పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 1,90,654 మంది అధికంగా ఉన్నట్టు తెలిపారు. థర్డ్ జెండర్లు 2,777 మంది ఓటర్లుగా నమోదైనట్టు చెప్పారు. మొత్తం ఓటర్లలో కొత్త ఓటర్లు(18 నుంచి 19 ఏండ్ల వారు)4,73,838 మంది, వృద్ధులు(85 ఏండ్లు పైబడిన వారు)2,25,462 మంది, వికలాంగులు 5,28,085 మంది, ఓవర్సీస్ 3,578 మంది నమోదైనట్టు వివరించారు. ఓటర్ల సవరింపు ప్రక్రియలోభాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 8,02,805 మంది ఓటర్లను తొలగించామని, కొత్తగా 4,14,165 మంది నమోదయ్యారని, 5,93,956 మంది మార్పులు, చేర్పులు చేసుకున్నట్టు సీఈవో తెలిపారు.

### ముఖ్యాంశాలు ఇలా..

- కొత్త ఓటర్లు, సవరణలు, మార్పుల కోసం ఈ నెల 9, 10 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించారు.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు ఓటర్ జాబితా వెరిఫికేషన్‌కు అవకాశం కల్పించారు.
- ఈ మేరకు ఆయా పోలింగ్ స్టేషన్లలో జాబితాలు అందుబాటులో ఉంచనున్నారు.
- ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలకు, ఓటర్ల నమోదుకు ఈ నెల 28 వరకు గడువు విధించారు.
- వచ్చే ఏడాది జనవరి 6న ఓటర్ల తుది జాబితా వెల్లడించనున్నారు.
- ఈ ఓటర్ జాబితా ఆన్‌లైన్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతారు.
- జనవరి 1, 2025 నాటికి 18 ఏండ్లు నిండినవారు కొత్తగా ఎన్‌రోల్‌మెంట్‌కు ఈ నెల 28 వరకు గడువు ఇచ్చారు.
- ఓటర్ల నమోదుకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1950కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.


## కళ్యాణమస్తు

..మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

### శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో



రెడ్డి వధూవరులకు ప్రత్యేకంగా చూడబడును మరియు అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి:
16 Year's Experience
Dr. Smt. Konala Bhagyalakshmi Reddy, Astrologer,
Ex:Telangana Marriage Bureau Association.
H.O.: షాప్ నెం.48, HMDA కాంప్లెక్స్, తార్నాక, హైదరాబాద్
B.O.: Opposite Sai Baba Temple, Dilsukhnagar,
Whatsapp: 9866044439

| వధువు కావలెను | వరుడు కావలెను |
|---|---|
| ★రెడ్డి:27 Yrs, 5'8", M.Tech., (IIT), సాఫ్ట్‌వేర్, 27 Lakhs P/A వరుడికి తగిన వధువు కావలెను. 7207930999 | ★ రెడ్డి:27 Yrs, 5'3", MS, Australia 82 K P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999 |
| ★రెడ్డి:28 Yrs, 6 Ft, MBBS, MS, Ortho, Doctor, 50 Cr. ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777 | ★రెడ్డి:29 Yrs, 5'3", MBBS, MD, Doctor వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★కమ్మ:30 Yrs, 5'9", CA, Accounts Officer,, 40 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9246960888 | ★కమ్మ:30 Yrs, 5'4", MBA (IIM) సాఫ్ట్‌వేర్, 30 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★కాపు:28 Yrs, 5'6", B.Tech, Software, 30 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★కాపు:26 Yrs, 5'2", B.Tech, Software, 11 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★మున్నూరుకాపు:29 Yrs, 5'8", M.Tech, (IIT), సాఫ్ట్‌వేర్, 20 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9030315599 | ★మున్నూరుకాపు:25 Yrs, 5'2", B.Tech, సాఫ్ట్‌వేర్, 9 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9010051444 |
| ★ ముదిరాజ్:30 Yrs, 5'8", B.Tech సాఫ్ట్‌వేర్, 10 Lakhs P/A వరుడికి తగిన వధువు కావలెను. 9010051444 | ★ముదిరాజ్:27 Yrs, 5'7", B.Tech., సాఫ్ట్‌వేర్, 35,000/- P/M గల వధువుకు తగిన వరుడు కావలెను. 9701960229 |
| ★మాల: 38 Yrs, 5'9", MBBS, MD, Doctor, 18 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9248064777 | ★మాల:29 Yrs, 5'2", B.Tech (IIT) సాఫ్ట్‌వేర్, 6 Lakhs P/A వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777 |
| ★మాదిగ: 31 Yrs, 5'5", BE, 18 Lakhs P/A గల వరుడికి తగిన వధువు కావలెను. 9010051444 | ★మాదిగ:29 Yrs, 4'12", MBA, సాఫ్ట్‌వేర్, 8 Lakhs P/A గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888 |
| ★CASTE NO BAR: 29 Yrs, 5'8", MS, Australia సాఫ్ట్‌వేర్,70 K వరుడికి తగిన వధువు కావలెను. 9701960229 | ★CASTE NO BAR:26 Yrs, 5'6", B.Tech, సాఫ్ట్‌వేర్, 30,000/- PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599 |
| ★మున్నూరుకాపు–II MATCH:32 Yrs, 5'9", B.Tech., బిజినెస్, 15 Lakhs P/M వరుడికి Any వధువు కావలెను. 7207930999 | ★II MATCH-కమ్మ: 35 Yrs, 5'7", B.Tech., సాఫ్ట్‌వేర్, 75,000/- P/M గల వధువుకి USA వరుడు కావలెను. 7207930999 |

| వధువు కావలెను | వేదికలు |
|---|---|
| ★ఆర్యవైశ్య అమ్మాయి కావలెను: ఆర్యవైశ్య అబ్బాయి 35, M.Ed. ప్రైవేటు లెక్చరర్, వ్యవసాయం, 46 వేలు, ఆస్థి కోటి, నల్లగొండ M9HB, మునుగోడ్ రోడ్, వీరయ్య:9121325068. | ★ ఫ్రీ*: అన్ని కులముల/మొదటి/రెండవ/లేటు...వధువు*/వరుల వివాహ సంబంధములకై మీ ఫొటో, బయోడేటా, మా వాట్సాప్ నెంబరు (9291503949)కు పంపించగలరు. "మా సేవ" మ్యారేజ్ బ్యూరో (Since 1998) Ph: 9291503949 |
| ★ముదిరాజ్/C.Govt.Executive Engineer (E.E)/6' ఎత్తు /29 సం॥లు మంచి జీతం, సొంత ఇల్లు మంచి ఆస్తి గల వరుడికి Well Settled Family నుండి వధువు కావలెను. Cont.9014235862 | 4 లైన్ల ప్రకటనకు 500/- ( + GST అదనం) ప్రతి అదనపు లైనుకు 125/- 9848077857 |


## • ఇందూర్‌ను కమ్మేసిన పొగమంచు



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాను పొగ మంచు కమ్మేసింది. శనివారం తెల్లవారుజాము నుంచే ఊర్లు, పైర్లు శ్వేతవర్ణమైన మంచుతెరలతో కనిపించకుండా పోయాయి. పల్లెలన్నీ పూర్తిగా మంచుగుప్పిట్లోకి చేరిపోయాయి. ఉదయం 8 దాటినా మంచుతెరలు వీడలేదు. ఎదురుగా రోడ్డు కనిపించక పోవడంతో వాహనదారులు హెడ్‌లైట్ వెలుతురులో రాకపోకలు సాగించారు. – ఖలీల్‌వాడి/కామారెడ్డి



## కాల్వలో తండ్రీకొడుకులు గల్లంతు

నల్లగొండ సిటీ, నవంబర్ 2 : ప్రమాదవశాత్తు కాల్వలో పడి తండ్రీకొడుకులు గల్లంతయ్యారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురవరం దామోదర్ (40), అతని కుమారుడు ఫణీంద్రవర్మ (14) స్నానం చేయడానికి గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ వద్దకు వెళ్లారు. కాల్వలో ఈత కొడుతున్న సమయంలో ఫణీంద్రవర్మ వరద తాకిడికి కొట్టుకుపోయాడు. గమనించిన తండ్రి దామోదర్ కొడుకును కాపాడే సమయంలో కాల్వలోకి దిగగా వరద తాకిడి ఎక్కువగా ఉండటంతో అతను కూడా కొట్టుకుపోయాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో వారి ఆచూకీ లభించలేదు. అగ్నిమాపక సిబ్బందితోపాటు గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపడుతున్నారు.


